క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం



మృత్యుంజయ హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న జడ్జి తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో బుధవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఘనంగా మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. తెల్లవారుజామున అగస్త్యేశ్వర స్వామి మూలవిరాట్‌కు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోక కల్యాణార్థం గోపూజ, గణపతి, నవగ్రహ, ఉప దేవతా హోమాలు, మృత్యుంజయ హోమాలను వేదపండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. జడ్జి సురేంద్రనాథరెడ్డి పాల్గొని హోమంలో పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మండల పూజ

గోపవరం : మండలంలోని చెన్నవరం గ్రామంలో వెలసిన శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా మండల పూజ నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య తిరుకల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఎక్కడాలేని విధంగా భద్రాచలంలో ఉన్న పట్టాభిరామస్వామివారినే ఇక్కడ ప్రతిష్ఠించడం, స్వామివారిని దర్శించుకోవడం ప్రత్యేక విశిష్టత ఉందని వేద పండితులు తెలిపారు. ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాటు చేసి 40 రోజులు పూర్తయిన సందర్భంగా ఈ రోజు ఈ మండల పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని పండితులు సత్యనారాయణశర్మ, పెంచలయ్యస్వామిలు తెలిపారు. గ్రామస్తులు తిరుకల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారికి కాయకర్పూరం సమర్పించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మెలకువలు పాటిస్తే లాభాలు

బి.కోడూరు : గొర్రెల యజమానులు గొర్రెల పెంపకంలో మెళకువలు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని ప్రభలవీడు పశువైద్యాధికారి లక్ష్మీనరసయ్య తెలిపారు. బుధవారం మండలంలోని మేకవారిపల్లెలో గొర్రెల యజమానులకు నట్టల నివారణ మందును ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల యజమానులు సీజనల్‌లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ముందస్తుగా వ్యాక్సిన్లు వేయించి మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందును గొర్రెలకు అందించాలన్నారు. దీనివలన జీవాల మరణ నమోదు సంఖ్య తగ్గుతుందని, దీంతో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు నరసింహ, పాడి రైతులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో సాగు లాభదాయకం

ఖాజీపేట : శాస్త్రీయ పద్ధతిలో సాగు చేయడంతో రైతులకు లాభం ఉంటుందని వ్యవసాయాధికారి నాగార్జున సూచించారు. ఖాజీపేట ఒకటో సచివాలయంలో సమాచార హక్కుపై అవగాహన కల్పించారు. రెండో సచివాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పత్తి పంటను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంట సాగులో సాంకేతిక జోడించుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చునని పేర్కొన్నారు.

తలనీలాలకు వేలంపాట

పోరుమామిళ్ల : మద్దిమాను గురప్పస్వామి ఆలయంలో ఏడాదిపాటు తలనీలాలు సేకరించేందుకు బుధవారం జరిగిన వేలంలో కానగూడూరుకు చెందిన బాలకొండయ్య రూ.15,65,000కు పాట దక్కించుకున్నాడు. అలాగే ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన యాదగిరి ఆలయంలో నిలువ ఉన్న తలనీలాలు రూ.8,87,950లకు వేలంలో దక్కించుకున్నారు. వేలం పాట ఈఓ నరసయ్య నిర్వహించారు.

భాస్కరరాజు మరణం బాధాకరం

బద్వేలు అర్బన్ : ప్రొద్దుటూరుకు చెందిన తెలుగు పండితులు, పద్యకవి, గ్రంథ రచయిత విద్వాన్ ఇ.ఎం.భాస్కరరాజు ఆకస్మికంగా మృతి బాధాకరమని భారత రాష్ట్రపతి గ్రహీత విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. బుధవారం మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో నిర్వహించిన సంతాప కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భాస్కరరాజు వృత్తిని దైవంగా భావించి సాహిత్యంలో మంచి కవిగా పేరు తెచ్చుకున్న స్నేహశీలి అని నివాళులర్పించారు. కార్యక్రమంలో మొల్ల సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్, కోశాధికారి జి.శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ఇప్పుడు గుర్తొచ్చిందా

అట్లూరు : ప్రేమోన్మాది చేతిలో మృతి చెందిన దస్తగిరమ్మ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పరామర్శించేందుకు వచ్చేది తెలుసుకున్న ప్రభుత్వం ఆకుటుంబానికి రూ.10 లక్షలు అందజేయడం చూస్తే ఈ ప్రభుత్వంకు ఈ సంఘటన ఇప్పుడు గుర్తొచ్చిందా అని మాజీ ఆర్టీసీ చైర్మన్ రెడ్యెం వెంకటసుబ్బారెడ్డి ప్రభుత్వాని విమర్శించారు.

పల్లె పండగకు ఇసుక కష్టాలు..!

- ఉచిత ఇసుక క్వారీ నుంచి తెచ్చుకోవాల్సిందేనట
- గిట్టుబాటు కాదంటూ టీడీపీ వర్గీయుల గగ్గోలు
- భూమి పూజలేగానీ.. మొదలుకాని సీసీ రోడ్ల నిర్మాణం

నియోజకవర్గంలో పనులు.. కేటాయించిన నిధుల వివరాలిలా ఉన్నాయి

మండలం	చేపట్టిన పనులు	కేటాయించిన నిధులు(రూ. కోట్లలో)
మైదుకూరు	47	రూ.2.18కోట్లు
చాపాడు	53	రూ.1.86కోట్లు
దువ్వూరు	43	రూ.2.61కోట్లు
ఖాజీపేట	38	రూ.1.89కోట్లు
బ్రహ్మంగారిమఠం	22	రూ.2.96కోట్లు
మొత్తం	203	రూ.11.50కోట్లు



నియోజకవర్గ ప్రజలకు అందని ఉచిత ఇసుక



ఇటీవల పల్లె పండుగలో భాగంగా బద్రిపల్లె సిమెంట్ రోడ్డు నిర్మాణానికి చేసిన భూమిపూజ

చాపాడు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు నిర్మించాలనే లక్ష్యంతో ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండగ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించింది. గుత్తేదారులు విజయవంతంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. సీసీ రోడ్ల పనులు చేపట్టాలంటే ఇసుక అవసరం. మైదుకూరు నియోజకవర్గంలో మాత్రం ఈ ఇసుక దొరకాలంటే కష్టమైపోతోంది. నదులు చెంతనే ఉన్నా.. ఉచిత ఇసుక పథకం అమలులో ఉన్నా.. క్వారీ నుంచి మాత్రమే ఇసుక తెచ్చుకోవాలనే నిబంధనతో పనులు చేపట్టే వారికి కష్టాలు తప్పడం లేదు.

మైదుకూరు నియోజకవర్గంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 203 పనులకు రూ.11.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ ప్రతి పంచాయతీలో అధికారులు, టీడీపీ నాయకులు పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పర్యటించి రోడ్ల నిర్మాణానికి ఆర్భాటంగా భూమి పూజలు నిర్వహించారు. అయితే పనులు మాత్రం ఇప్పటి వరకూ ప్రారంభించలేదు. ప్రధాన కారణం ఇసుక కొరతేనని టీడీపీ వర్గీయులే చెబుతున్నారు. నియోజకవర్గంలోని చాపాడు, ఖాజీపేట మండలాల పరిధిలో పెన్నానది ఉన్నప్పటికీ ఇసుక క్వారీ ఏర్పాటు చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో మైదుకూరులో ఇసుక డంపు చేసి విక్రయించారు. కూటమి ప్రభుత్వ హయాంలో డంపు చేయలేదు. దీంతో వీరపునాయునిపల్లె మండలం అనిమెల గ్రామం వద్ద ఇసుక క్వారీ నుంచి తెచ్చుకోవాలని అధికారులు కాంట్రాక్టర్లకు సూచించారు. టిప్పర్ ఇసుక తెచ్చుకోవాలంటే రూ.17–30 వేల వరకూ అవుతోందని, తమకు గిట్టుబాటు కాదనే ధోరణిలో గుత్తేదారులు పనులు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. చాపాడు, ఖాజీపేట మండలాల నుంచి అక్రమంగా వచ్చే ఇసుకను గ్రామాలకు తరలించినప్పటికీ పనుల మేరకు సరిపడదని చెబుతున్నారు.

> **ఇసుక క్వారీ ఏర్పాటు చేస్తామన్నారు**
>
> మైదుకూరు నియోజకవర్గానికి వీఎన్.పల్లె మండలం అనిమెల వద్ద క్వారీ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఇసుక తెచ్చుకోవాలి. అక్కడి నుంచి ఇసుక తెచ్చుకోవాలంటే ఇబ్బంది అవుతుందని కాంట్రాక్టర్లు తెలిపారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో నియోజకవర్గంలో ఇసుక క్వారీ ఏర్పాటు చేస్తామని చెప్పారు.
>
> \- మధుసూదనరావు, పంచాయతీరాజ్ డీఈఈ

జ్వరాలు రాకుండా ముందస్తు చర్యలు



మాట్లాడుతున్న అధికారి శ్రీనివాస్

ప్రొద్దుటూరు : దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డి, ప్రొద్దుటూరు మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ప్రొద్దుటూరు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్, వేస్ట్ ఆయిల్ వేసి దోమల లార్వాను నివారించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి జ్వరాలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సూపర్‌వైజర్ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు రామ్మోహన్‌రెడ్డి, రామకృష్ణ, అన్ని సచివాలయాల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



బద్వేలులో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు



హెలీప్యాడ్ వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం వేచివున్న అభిమానులు

పశువులకు మెరుగైన వైద్యం అందించాలి

- శ్రీవెంకటేశ్వర పశువైద్య యూనివర్సిటీ వీసీ డాక్టర్ జేవీ రమణ
- వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో జాతీయ స్థాయి సదస్సు ప్రారంభం



కాన్ఫరెన్స్ కాంపెండియమ్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ డాక్టర్ జేవీ రమణ, ప్రొఫెసర్లు

ప్రొద్దుటూరు : ఆధునిక వైద్య పద్ధతుల ద్వారా పశువులకు మెరుగైన వైద్యం అందించాలని శ్రీ వెంకటేశ్వర పశువైద్య యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జేవీ రమణ తెలిపారు. మండలంలోని గోపవరం వద్ద ఉన్న పశువైద్య కళాశాలలో బుధవారం జాతీయ సైన్స్ సదస్సును ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రాజకిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వీసీ డాక్టర్ జేవీ రమణ, డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, ఎస్‌వీఎస్‌బీటీ ప్రెసిడెంట్ డాక్టర్ ఏజే ధామి, జనరల్ సెక్రటరీ డాక్టర్ కేకే హదియా జ్యోతి జ్వలన చేసి ప్రారంభించారు. వీసీ జేవీ రమణ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రైతులకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. పశువులలో వచ్చే వ్యాధులను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి నివారించాలన్నారు. పాడి రైతుల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ జాతీయ సదస్సు ప్రాముఖ్యతను వివరించారు. కాన్ఫరెన్స్ కాంపెండియమ్‌ను ముఖ్య అతిథులు విడుదల చేశారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు పశువైద్య రంగంలో చేసిన పరిశోధన పత్రాలను ప్రజెంట్ చేశారు. శాస్త్రవేత్తలకు మెమెంటోలు బహుకరించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇందిర, డాక్టర్ మానస, డాక్టర్ అనూష్, డాక్టర్ మంజుల, డాక్టర్ నాగమల్లిక తదితరులు పాల్గొన్నారు.

శుభ్రమైన కళాశాల మైదానం



మైదానం శుభ్రం చేస్తున్న డోజర్

పోరుమామిళ్ల : ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో తెల్లవారు జామున 4 గంటల నుంచి యువకులు, వృద్ధులు వాకింగ్ చేస్తుంటారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల దాకా వాకింగ్ చేయడం చాలామందికి అలవాటుగా మారింది. ఇటీవల కురుస్తున్న వానల కారణంగా మైదానంలో పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగిపోయాయి. దాంతో వాకర్స్‌తో పాటు మైదానంలో ఆట్లాడుకునేందుకు విద్యార్థులకు కూడా ఇబ్బంది తలెత్తింది. ఈ విషయం విద్యార్థులు, వాకర్స్ రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డికి తెలిపారు. ఆయన స్పందించి కార్యదర్శి రాజీవ్‌రెడ్డితో మాట్లాడి యంత్రాలతో మైదానం శుభ్రం చేయించారు. పంచాయతీ సిబ్బంది పిచ్చిమొక్కలు తీసివేశారు. మైదానం బాగు చేయడంపై వాకింగ్ చేసేవారు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తల్లిదండ్రులను, గురువులను గౌరవించండి

పోరుమామిళ్ల : తల్లిదండ్రులను ప్రేమించాలని, గురువులను గౌరవించాలని వివేకానంద ఫౌండేషన్ గౌరవ సలహాదారులు తాడిపత్రికి చెందిన రాజోలి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కస్తూర్బా బాలికోన్నత పాఠశాలలో వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి తల్లిదండ్రుల ప్రాధాన్యతపై చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని, చిన్నప్పటి నుండే ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి వారికి మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందచేశారు. మండలంలోని రంగసముద్రంకు చెందిన దూళ్ల శ్రీనాథ్‌రెడ్డి పది సంవత్సరాలు జపాన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసి జన్మభూమిపై మక్కువతో ఉద్యోగాన్ని వదిలి ఇంటికి వచ్చి సేంద్రి వ్యవసాయం చేస్తున్నారు. ఆయన్ను ప్రోత్సహించేందుకు పాఠశాల సదస్సులోనే వివేకానంద ఫౌండేషన్ తరపున జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందచేసి సన్మానించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

చాపాడు : మండలంలోని పల్లవోలు వద్ద గల ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రవీంద్రకుమార్ తెలిపారు. జిల్లాలోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన అండర్–14 బాస్కెట్ బాల్ విభాగంలో జె.శర్వాణి, జేష్ఠ సాయి, చదరంగంలో పి.అభిరామన్, క్రికెట్‌లో కె.ఉమర్ సిద్దిక్, బి.చేతన్‌రెడ్డి, నిశిల్ సంగ్వాన్, స్కేటింగ్‌లో వి.జయవర్ధన్ శాస్త్రి(అండర్–11) ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం స్థానిక ఐడీపీఎస్‌లో పాఠశాల చైర్మన్ డా.వి.జయచంద్రారెడ్డి చేతుల మీదుగా వారికి పతకాలు అందజేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో..

గోపవరం : మండలంలోని కాలువపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.సుప్రజ విద్యార్థిని అండర్–14 కబడ్డీ విభాగంలో ఈనెల 22న కడప స్టేడియంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో రాష్ట్రస్థాయి గేమ్స్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి తెలిపారు. విద్యార్థినిని ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు అభినందించారు.



సుప్రజ

సౌత్‌జోన్‌కు సీబీఐటీ విద్యార్థులు

చాపాడు : నంద్యాలలోని శాంతిరాం, నెల్లూరులోని ఎస్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో జరిగిన జేఎన్‌టీయూ ఇంటర్ యూనివర్సిటీ బాల్‌బాడ్మింటన్, ఖోఖో పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభ చాటారని చైతన్య భారతి ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) ప్రిన్సిపల్ డా.ఎస్.శృతి తెలిపారు. నంద్యాలలో జరిగిన బాస్కెట్ బాల్ పోటీలలో సీబీఐటీకి చెందిన ఎస్.నిఖిల్ ఆల్ ఇండియా బాల్ బాడ్మింటన్‌కు ఎంపిక కాగా, నెల్లూరులోని ఎస్‌బీకేఆర్ కాలేజీలో జరిగిన ఖోఖో ఎంపికల్లో వై.నాగతనూజ, సి.హరిచందన, సీఎస్‌సీఎంఎల్ విభాగానికి చెందిన ముక్తుమ్ సాబ్ సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కళాశాల అకడమిక్ డీన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

రౌడీషీట్ ఓపెన్ చేయడం దారుణం

కాశినాయన : మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామానికి చెందిన సీపీఎం పార్టీ మండల కన్వీనర్ పోలయ్యపై రౌడీషీటర్ ఓపెన్ చేయడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ తెలిపారు. బుధవారం నరసాపురంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట అన్వేష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తే రౌడీషీటర్ ఓపెన్ చేస్తారా అని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని నిరసన

ప్రొద్దుటూరు : దళితుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన రూరల్ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ తెలిపారు. బుధవారం స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లె పంచాయతీ అమృతానగర్ మడూరు రోడ్డులో ప్లాట్ నంబర్ 783 ఇంటి స్థలం రామేశ్వరానికి చెందిన శంకర్‌రెడ్డి బంధువులదని పెట్లు సుబ్బయ్య ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ 21న రూ.లక్షకు తీసుకున్నానన్నారు. ఆ స్థలంలో రూ.3 లక్షలు ఖర్చు చేసి బేస్‌మట్టం నిర్మించానని తెలిపారు. ఇటీవల బొల్లవరానికి చెందిన లక్ష్మీ అనే మహిళ ఆ ఇంటి వద్దకు వచ్చి ఈ స్థలం నాదని నానా గొడవ చేసిందన్నారు. ఈ విషయంపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా దళితుడైన తనపట్ల ఎస్ఐ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ, హోం మంత్రి, డీజీపీలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నారాయణస్వామి, రాజేశ్వరి, కొండయ్య, మురళీ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సారూ.. ఈ దారి వంక సూడరూ..!



బురదమయంగా ఉన్న రాజుపాలెం తొండలదిన్నె పంట పొలాలకు వెళ్లే దారి

రాజుపాళెం : రాజుపాళెంలోని కేసీ చాపాడు కాలువ మీదుగా తొండలదిన్నె పొలాలకు వెళ్లే రహదారిని బాగు చేయాలని అక్కడి రైతులు కోరుతున్నారు. గతంలో ఆ దారిలో కంకరతో కూడిన గ్రావెల్ రహదారి వేశారని, అయితే ప్రస్తుతం గ్రావెల్ పోవడంతో దారంతా బురదమయంగా మారిందని తెలిపారు. వర్షాకాలంలో పంట పొలాలకు వెళ్లేందుకు వీలులేకుండా పోతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు స్పందించి రహదారిని బాగుచేయాలని వారు కోరుతున్నారు.

అనుమతి తప్పనిసరి

పోరుమామిళ్ల : దీపావళి పండుగ సందర్భంగా పటాసులు అమ్ముకునుటకు అనుమతి తప్పని సరి అని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. విక్రయించేందుకు తగిన వసతులు, ఏర్పాట్లు ఉండాలని, ఊరికి దూరంగా గోడౌన్ ఉండాలన్నారు. నిబంధనల మేరకు నడచుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ



వీరభవితను అభినందిస్తున్న సురేష్‌బాబు, అల్లాబకాష్

ప్రొద్దుటూరు కల్చరల్ : కల్లూరు జెడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని సానేపల్లి వీరభవిత రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. ఈ నెల 20 నుంచి 22 వరకు నంద్యాలలోని డీఎస్ఏ స్టేడియంలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్–17 రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిత్యం వహించిన వీరభవిత సాబర్ ఈవెంట్ జట్టు పోటీలో ప్రతిభ కనపరచి పతకం సాధించింది. ఈ విద్యార్థినిని పాఠశాల హెచ్ఎం సురేష్‌బాబు, పీడీ అల్లా బకాష్, ఉపాధ్యాయులు అభినందించారు.

దోషులకు శిక్ష పడాలి

పోరుమామిళ్ల : విద్యార్థిని దస్తగిరమ్మపై జరిగిన అమానుషకాండకు కారణమైన విఘ్నేష్‌కు కఠిన శిక్ష పడాలని పీఆర్ ఆర్ఆర్డీ మాజీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ గతంలో తెచ్చిన దిశ చట్టాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయకుండా ఉండి ఉంటే పరిస్థితి వేరేగా ఉండేదన్నారు.